క్లుప్తంగా

నేడు గడప గడపకూ మన ప్రభుత్వం

వాల్మీకిపురం: మండలంలోని మేకలవారిపల్లి, రాములవారిపల్లి, చారావాండ్లపల్లి, మద్దెలచెరువుపల్లి గ్రామాల్లో బుధవారం ఉదయం 6గంటల నుంచి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ షబ్బీర్ అహ్మద్ తెలిపారు. ఇందులో భాగంగా పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఇంటింటికి వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకొని, పరిష్కార సమస్యలను అక్కడిక్కడే పరిష్కరిస్తారని తెలిపారు. మండల స్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు హాజరుకావాలని కోరారు.

లైన్‌ఇన్స్‌పెక్టర్‌గా భాస్కర్

పెద్దతిప్పసముద్రం : విద్యుత్ లైన్ ఇన్స్‌పెక్టర్‌గా భాస్కర్ నియమితులైనట్లు డిస్కం ఏఈ ఉత్తన్న మంగళవారం పేర్కొన్నారు. ఈయన గతంలో మదనపల్లిలో పని చేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇన్నాళ్ళూ ఇక్కడ ఎల్‌ఐగా పని చేస్తున్న రఘుస్వామి మదనపల్లికి బదిలీపై వెళ్ళారని ఏఈ పేర్కొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

కురబలకోట : మండల రెవెన్యూ కార్యాలయం వద్ద మంగళవారం చలివేంద్రాన్ని తహసీల్దారు భీమేశ్వరరావు ప్రారంభించారు. వేసవిలో వివిధ పనులపై వచ్చే ప్రజలు దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ తెలిపారు.

బి.కొత్తకోట : స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యాలయానికి వచ్చే ప్రజలు, స్థానికులకు చల్లని నీటిని అందించేందుకు ఏర్పాటు చేశారు.

పెద్దమండ్యం: మండలంలోని శిద్దవరం పంచాయతీ కోటగుట్టపల్లె బస్టాండులో ఎంపీడీఓ శ్రీధర్‌రావు, గ్రామ సర్పంచ్ విజయకుమారి చలివేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. చలివేంద్రంలో ప్రజలకు మజ్జిగ, మంచినీరు, ఓఆర్‌ఎస్ అందుబాటులో ఉంటాయని ఎంపీడీఓ తెలిపారు. చలివేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

భూ రీసర్వేలో రికార్డుల తనిఖీ

పెద్దతిప్పసముద్రం: మండలంలోని జగడంవారిపల్లిలో మంగళవారం తహసీల్దార్ విద్యాసాగర్ పర్యవేక్షణలో మండల సర్వేయర్ రఫీ బృందం చేపట్టిన భూ రీసర్వే రికార్డులను జిల్లా సర్వే, భూ రికార్డుల అధికారి జయరాజ్ అకస్మికంగా తనిఖీ చేశారు. సర్వేలో డిప్యూటి ఇన్స్‌పెక్టర్ ఆఫ్ సర్వే అధికారి బృందం క్రిష్ణమూర్తి, లక్ష్మీనారాయణ, రమణారెడ్డి హాజరయ్యారు.

శభాష్.. మహ్మద్ సిరాజ్



మహ్మద్ సిరాజ్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే

తంబళ్లపల్లె : కన్నెమడుగు జెడ్పీ ఉన్నత పాఠశాల పదోతరగతి విద్యార్థి మహ్మద్ సిరాజ్ రాష్ట్ర స్థాయి సైన్సుఫేర్‌లో మ్యాన్‌హోల్ క్లీనింగ్ డివైజ్(మ్యాన్‌హోల్ ను శుభ్రంచేసే పరికరం) ప్రాజెక్టును గైడ్ టీచర్లు రమణమ్మ, పీఎల్‌ఎన్ శాస్త్రి సూచనల మేరకు రూపొందించి డెమో ఇచ్చారు. ఆ ప్రాజెక్టు జాతీయస్థాయి సైన్సుఫైర్‌కు ఎంపికైంది. మంగళవారం ఎమ్మెల్యే పాఠశాలను సందర్శించి ఆ విద్యార్థిని అభినందించారు. విద్యార్థులు సిరాజ్‌ను ఆదర్శంగా తీసుకుని భవిష్యత్తులో శాస్త్రవేత్తలుగా ఎదగాలన్నారు. ఎంపీడీవో ఆనంద్‌కుమార్, ఎంఈవో త్యాగరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు ఇద్దరు ఎంపిక

మదనపల్లె : నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్‌కు పట్టణంలోని బాబునగర్ ఎంపీయూపీ స్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థినులు అర్హత సాధించినట్లు హెచ్‌ఎం సరస్వతి తెలిపారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. తమ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న హరిత, తేజశ్రీలు ఎన్‌ఎంఎంఎస్ పరీక్షలో ప్రతిభ చాటి స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు తెలిపారు.

వేలంలో రూ. 2.1 లక్షల ఆదాయం

పెద్దమండ్యం: మండలంలోని బండమీదపల్లె పంచాయతీలో నిర్వహించిన వేలంలో రూ. 2.1 లక్షల ఆదాయం పంచాయతీకి సమకూరింది. మంగళవారం గ్రామ సర్పంచ్ మొలక బయ్యారెడ్డి అధ్యక్షతన, ఎంపీడీవో శ్రీధర్‌రావు ఆధ్వర్యంలో పంచాయతీ పరిధిలోని పసలబండ, వారపుసంతలకు వేలం నిర్వహించారు. వారపు సంతకు జరిగిన వేలంలో రూ. 1.1 లక్షలకు కదిరికి చెందిన విశ్వనాథనాయుడు, పసలబండకు జరిగిన వేలం లో తురకపల్లెకు చెందిన శివకుమార్ రూ. 1 లక్షకు దక్కించుకున్నారు. మాజీ సర్పంచ్‌లు మొలక సాంబశివారెడ్డి, సంతోషి, పంచాయతీ కార్యదర్శి శైలజ పాల్గొన్నారు.

టీబీ వ్యాధిగ్రస్తులకు వాసవిక్లబ్ చేయూత

పీలేరు రూరల్ : టీబీ వ్యాధి గ్రస్తులకు పౌష్టికాహారం పంపిణీ చేయడానికి పీలేరు వాసవిక్లబ్ గ్రేటర్, వాసవికపుల్స్ క్లబ్ సభ్యులు ముందుకొచ్చారు. మంగళవారం 20 మంది క్షయవ్యాధిగ్రస్తులకు ఒక నెలకు సరిపడా పోషక విలువలు గల ఆహారంను స్థానిక ప్రభుత్వాస్పత్రికి అందజేశారు. ఈ సందర్భంగా వాసవిక్లబ్ సభ్యులు మాట్లాడుతూ ఆరు నెలల పాటు పోషకాహారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జూటూరు అరవింద్ శివఫణీష్, ఆమూరి మహిధర్, శంకర్‌నాథ్ పాల్గొన్నారు.

ప్రజల ఆశీస్సులతో నియోజకవర్గ అభివృద్ధి

- సంక్షేమ పథకాలతో రాష్ట్రం సుభిక్షం
- గడపగడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి



కన్నెమడుగు ఉన్నత పాఠశాలలో నాడు-నేడు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

తంబళ్లపల్లె : ప్రజల ఆశీస్సులతో నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమైంది. వరుణదేవుడి కరుణతో వర్షాలు సంవృద్ధిగా కురిసాయి. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సంక్షేమ పథకాలతో రాష్ట్రం సుభిక్షంగా ఉందని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని మర్రిమాకులపల్లె, కన్నెమడుగు పంచాయతీలలో గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పర్యటించారు. ప్రజలతో మమేకమై సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి కుటుంబం పిల్లలను చదివించుకుంటూ, ఆర్థికంగా స్థిరపడుతున్నామని మహిళలు ఎమ్మెల్యే ఎదుట సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రెడ్డివారిపల్లె ప్రాథమిక పాఠశాలకు రెండో దశ నాడు-నేడు కార్యక్రమంతో రూ.12లక్షల అంచనాతో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. మర్రిమాకులపల్లెలో 9 స్వయం సహాయక మహిళా సంఘాలకు వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా 3వ విడత రూ.7.39లక్షలు విడుదలయ్యాయని మహిళలు ఆనందం వ్యక్తం చేశారు. కన్నెమడుగు పంచాయతీలో జడ్పీ ఉన్నత పాఠశాలకు రెండోదశ నాడు-నేడు కింద రూ.1.11కోట్లు అంచనాతో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు జ్యోతి, శ్యామలమ్మ, ఎంపీటీసీ సభ్యులు మహేష్, రాష్ట్రపద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ సురేంద్రనాథ్, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ నారాయణరెడ్డి, మల్లయ్యకొండ ఆలయ చైర్మన్ మల్లిరెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ భార్గవ్‌రెడ్డి, ఆర్‌బీకే చైర్మన్ రెడ్డిమల్‌రెడ్డి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, మండల ప్రత్యేక ఆహ్వానితుడు చిన్నరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చౌడేశ్వర్ తహసీల్దార్ కళావతి, ఎంపీడీఓ ఆనంద్‌కుమార్, హౌసింగ్ డీఈ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ హుండీ ఆదాయం లెక్కింపు



రెడ్డెమ్మతల్లి ఆలయ హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న అధికారులు

గుర్రంకొండ : మండలంలోని సంతానదేవత రెడ్డెమ్మకొండ ఆలయానికి హుండీ ద్వారా రూ.7,51,688 ఆదాయం సమకూరింది. మంగళవారం స్థానిక ఆలయంలో మదనపల్లె దేవదాయశాఖ ఇన్స్‌పెక్టర్ శశికుమార్ ఆధ్వర్యంలో హుండీ ఆదాయాన్ని లెక్కించారు. రెండునెలల కాలానికి సంబంధించి హుండీ ఆదాయాన్ని లెక్కించినట్లు చెప్పారు. నగదు రూపంలో రూ. 7,51,688 బంగారు నగలు 21 గ్రాములు, వెండికానుకలు 79 గ్రాములు వచ్చినట్లు లెక్కతేల్చారు. హుండీ ద్వారా వచ్చిన ఆదాయం మొత్తాన్ని వాల్మీకిపురం సప్తగిరి గ్రామీణ బ్యాంకులో జమ చేయనున్నట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ నరసింహారెడ్డి, ఈఓ మంజుల, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగులో మెలకువలు పాటించాలి



అవగాహన కల్పిస్తున్న ఏడీఏ శ్రీకాంత్

గుర్రంకొండ: చిరుధాన్యాల సాగులో రైతులు మెలకువలు పాటించాలని జిల్లా ఏడీఏ శ్రీకాంత్ అన్నారు. మంగళవారం స్థానిక ఆర్బీకేలో పంటల సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చిరుధాన్యాలైన రాగి, సజ్జ, సామ, ఊదలు, కొర్రలు, అరికెలు సాగు విధానంలో తగిన మెలకువల పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చన్నారు. రైతులకు ఎటువంటి సమాచారమైనా ఆర్బీకే సిబ్బందిని అడిగి తెలుసుకోవచ్చన్నారు. రాబోయే కాలంలో సమాజంలో చిరుధాన్యాల వినియోగం ఎక్కువగా ఉంటుందన్నారు. ఈ రకం పంటలకు భవిష్యత్‌లో మంచి డిమాండ్ ఉంటుందన్నారు. వరి, మిరప, మామిడితోటల్లో ఆవహించే నల్ల తామర పురుగు నివారణ కొసం ఫిప్రోనిల్‌ను లీటరు నీటిలో 2 ఎంఎల్ చొప్పున కలిపి పంటపై పిచికారీ చేయాలన్నారు. మామిడిలో పండు ఈగ నివారణ కోసం మిథైల్‌ముడినాల్ బుట్టలు తోటల్లో అమర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో వాల్మీకిపురం క్లస్టర్ ఉద్యాన శాఖాధికారి ప్రసన్న లక్ష్మీ, ఏఓ రత్నమ్మ, ఆర్బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి



మద్దయ్యగారిపల్లిలో పోషణ్ పక్వాడా కార్యక్రమం

పెద్దతిప్పసముద్రం : గర్భిణులు, బాలింతలు మంచి పోషక విలువలు ఉన్న ఆహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయరాణి సూచించారు. పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆమె మండలంలోని మద్దయ్యగారిపల్లి అంగన్‌వాడీలో గర్భిణులు, బాలింతలతో సమీక్షించారు. చిన్న పిల్లలకు బలవర్ధకమైన పౌష్టికాహారం అందించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం తల్లీ, పిల్లల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని అంగన్‌వాడీ కేంద్రాలకు అందించే ప్రతి వస్తువునూ సద్వినియోగం చేసుకోవాలని కోఆప్షన్ ఖాదర్‌వలి అన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీలో రూ. 22వేల రికవరీ



సామాజిక తనిఖీ నిర్వహిస్తున్న అధికారులు

వాల్మీకిపురం : స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద మంగళవారం నిర్వహించిన సామాజిక తనిఖీలో రూ.22,979లు రికవరీకి ఆదేశించినట్లు డ్వామా పీడీ మద్దిలేటి తెలిపారు. ఉపాధి హామీ పథకం, పంచాయతీ రాజ్, అటవీశాఖ, సర్వశిక్ష అభియాన్ శాఖలకు సంబంధించి రూ.6,57,21,561 కూలీల వేతనం కాగా, సామగ్రికి రూ.2,36,69,910 ఖర్చు అయ్యిందన్నారు. ఇందులో రూ.22,979 రికవరీకి ఆదేశించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి ప్రకాష్, ఎంపీడీఓ షబ్బీర్ అహ్మద్, వైస్ ఎంపీపీ వెంకట్రమణ, ఉపసర్పంచ్ కేశవ రెడ్డి, ఏపీడి మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

చెత్త సంపదతో పంచాయతీకి ఆదాయం

డీపీఓ ధనలక్ష్మి



చెత్త సంపద కేంద్రాలను తనిఖీ చేస్తున్న డీపీఓ ధనలక్ష్మి

వాల్మీకిపురం: పంచాయతీలో చెత్త సంపదను సృష్టించడం వలన పంచాయతీలకు ఆదాయం సమకూరుతుందని డీపీఓ ధనలక్ష్మి అన్నారు. మంగళవారం బోగంపల్లి మిని రిజర్వాయర్ సమీపంలో జగనన్న స్వచ్ఛ సంకల్పంలో భాగంగా తడి చెత్త, పొడి చెత్త ద్వారా సంపదను ఎలా పొందడం అనే కార్యక్రమంపై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీపీఓ మాట్లాడుతూ తడిచెత్త, పొడి చెత్త సేకరించడం ద్వారా ఎప్పటికప్పుడు గ్రామాలు పరిశుభ్రంగా ఉండడమే కాకుండా సేకరించిన చెత్త ద్వారా సంపదను సృష్టించి, పంచాయతీకి ఆదాయం లభిస్తుందన్నారు. తడి చెత్త, పొడి చెత్తను సేకరించి ఎరువులు తయారీ చేయాలని సూచించారు. అనంతరం మొక్కలు నాటి, ఎరువులను పరిశీలించారు. అనంతరం స్థానిక హసన్‌ఖాన్‌వీధిలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి, రికార్డులు తనిఖీ చేశారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ జయకుమారి, ఈఓ ఉదయ్ కుమార్, ఈఓపీఆర్‌డీలు చలపతి, శకుంతల, సీడీపీఓ భారతి, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి సంస్కృత కావ్యాలు అందజేత



సంస్కృత కావ్యాలను, గ్రంథాలను అధికారి వసంతకుమారికి అందిస్తున్న మరసం సభ్యులు

మదనపల్లె : మదనపల్లె రచయితల సంఘం(మ.ర.సం.) పూర్వ కార్యదర్శి కరణం బాలసుబ్రహ్మణ్యంపిళ్లై సంస్కృత కావ్యాలను మంగళవారం ఆయన కుమారుడు విద్యాసాగర్, మ.ర.సం. అధ్యక్షులు పీ.వి.ప్రసాద్ గ్రంథాలయాధికారి వసంతకుమారికి అందజేశారు. సంస్కృత భాషా పరిరక్షణకు తోడ్పాటునందించాలని కోరుతూ, బాలసుబ్రహ్మణ్యం పిళ్లై సంస్కృత కావ్యాలు, గ్రంథాలు కలిగిన బీరువాను గ్రంథాలయానికి అందించారు. ఈ సందర్భంగా బాలసుబ్రహ్మణ్యం పిళ్లై అడుగుజాడల్లో నడుస్తూ తెలుగు, సంస్కృత భాషల పరిరక్షణకు కృషిచేస్తున్న ఆయన కుమారులను మరసం సభ్యులు అభినందించారు. కార్యక్రమంలో లింగాలయుగంధరాచారి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను దూషించిన ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోండి

కేవీపల్లె : విద్యార్థులను కులంపేరుతో దూషించిన ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని వివిధ విద్యార్థి సంఘాలు, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని గ్యారంపల్లె పంచాయతీ జి.కొత్తపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల ముందు విద్యార్థులతో కలసి ధర్నా చేపట్టారు. నాయకులు మాట్లాడుతూ జి.కొత్తపల్లె పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడు విద్యార్థులను కులం పేరుతో దూషించారని ఆరోపించారు. తరగతి గదిలో అంటరానితనం, కుల వివక్ష చూపడం హేయమైన చర్య అని పేర్కొన్నారు. ఎంఈవో రెడ్డిబాషా సంఘటనా స్థలానికి చేరుని విద్యార్థి నాయకులతో చర్చించారు. కార్యక్రమంలో ఎస్‌ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అమృతతేజ, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు టి.ఎల్. వెంకటేష్, ఎమ్మార్పీఎస్ ఉమ్మడి చిత్తూరు జిల్లా కన్వీనర్ దుద్దు రామకృష్ణ, డీబీఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు భానుప్రకాష్, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ములకలచెరువు : కర్ణాటక నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యం స్వాధీనం చేసుకొని ఒక కారును సీజ్ చేసినట్లు ఎస్‌ఈబీ సీఐ మల్లిక మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్కిల్ పరిధిలోని పీటీఎం మండలం పులికల్లు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఒక ఇండిగో కారు నిలపకుండా వెళ్లినట్లు తెలిపారు. సిబ్బందితో కారును వెంబడించి పోకనాటువారిపల్లె వద్ద అదుపులోకి తీసుకున్నామన్నారు. డ్రైవర్, మరో యువకుడు తప్పించుకొని పారిపోయారు. కారును తనిఖీ చేయగా అందులో 25 కేసుల మద్యం ఉండడంతతో సీజ్ చేసినట్లు తెలిపారు. అనంతరం కారు యజమాని కే.భరత్‌కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ఈద్గా అభివృద్ధి పనులు ప్రారంభం

కలికిరి : మండల కేంద్రం సమీపంలో ముస్లి మైనారిటీల సౌకర్యార్థం నూతన ఈద్గా ఏర్పాటుకు ఎంపీ పీవీ మిథున్ రెడ్డి సొంత నిధులతో స్థలం ఏర్పాటు చేశారు. వైఎస్సార్‌సీపీ మండల మైనారిటీ నేతలు ఈద్గా స్థలం అభివృద్ధిలో భాగంగా మంగళవారం తాగునీటి బోరు డ్రిల్లింగ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ ఆఫామొహిద్దీన్, స్థానిక నేతలు బావాజీ, ముస్లిం మత పెద్దలు షఫీ, కరీముల్లా, కేజీఎస్, హజరత్ అలీ, ఫయాజ్, ఖాదర్ వల్లి పాల్గొన్నారు.

రొమ్ము కేన్సర్‌ను నిర్లక్ష్యం చేయవద్దు

గుర్రంకొండ: రొమ్ము కేన్సర్‌కు నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో వైద్యం చేయించుకోవాలని బెంగళూరుకు చెందిన ఎనేబుల్ ఇండియా సేవా సంస్థ అసోసియేట్ మేనేజర్ అశ్వనీరావ్ అన్నారు. మంగళవారం స్థానిక రీడ్ సంస్థ కార్యాలయంలో సేవా సంస్థ ఆధ్వర్యంలో రొమ్ము కేన్సర్ ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా శిబిరానికి హాజరైన మహిళలకు బెంగళూరుకు చెందిన సైట్ కేర్ క్యాన్సర్ హాస్పిటల్‌కు చెందిన వైద్యులు ఆయేషాభాను, నూరిన్నిసాలు వైద్యపరిక్షలు నిర్వహించారు. దేశంలో ప్రతి 28 మహిళలకు స్క్రీనింగ్ చేస్తే అందులో ఒక్కరికి రొమ్ము కేన్సర్ ఉంటుందన్నారు. అయితే ఈవ్యాధిని సునాయసంగా కట్టడి చేయవచ్చన్నారు. 40 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళ ఏడాది కొకమారు తప్పనిసరిగా ఆరోగ్య పరీక్షలు చేసుకోవాలన్నారు.

గడువులోపు పరికరాలు తీసుకోండి

పెద్దమండ్యం : రైతుమిత్ర గ్రూపులకు ప్రభుత్వం ద్వారా అందజేస్తున్న ట్రాక్టర్‌లు, వ్యవసాయ పరికరాలు ఈ నెల చివరినాటికి తీసుకోవాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఉమామహేశ్వరి అన్నారు. మండలంలోని కలిచెర్ల, ముసలికుంట, పెద్దమండ్యం, ఎస్‌వోపల్లె, శిద్దవరం రైతు భరోసా కేంద్రాలను మంగళవారం ఆమె అకస్మికంగా తనిఖీ చేశారు.

నేడు ఎస్టీ కమిషన్ సభ్యుడి పర్యటన

మదనపల్లె : ఎస్టీ కమిషన్ మెంబర్ వడిత్యా శంకర్‌నాయక్ బుధవారం కోటావారిపల్లె తండాలో పర్యటించనున్నారని జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారిక అధికారి కె.అబ్లాలోము తెలిపారు. మంగళవారం ఈమేరకు జిల్లా గిరిజన సంక్షేమ కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు.

అంగన్‌వాడీల అభివృద్ధికి అన్ని రకాల చర్యలు

ఎమ్మెల్యే నవాజ్‌బాషా



అంగన్‌వాడీలకు నియామకపత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

మదనపల్లె : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అంగన్‌వాడీల అభివృద్ధికి అన్ని రకాల చర్యలు తీసుకుంటోంది. నూతనంగా ఎంపికైన ఉద్యోగులు తమకు వచ్చిన అవకాశాన్ని వినియోగించుకుని ప్రభుత్వానికి మంచిపేరు తీసుకువచ్చే విధంగా పనిచేయాలని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. మంగళవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో మదనపల్లె నియోజకవర్గంలోని రామసముద్రం, నిమ్మనపల్లె, మదనపల్లె మండలాల్లో అంగన్‌వాడీ ఖాళీలకు నూతనంగా ఎంపికైన ఉద్యోగులకు నియామకపత్రాలను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..మదనపల్లె ఐసీడీయస్ ప్రాజెక్ట్ పరిధిలో అంగన్‌వాడీ వర్కర్స్...4, హెల్పర్స్..6, మినీ వర్కర్..1, పుంగనూరు ఐసీడీయస్ ప్రాజెక్ట్ పరిధిలోని రామసముద్రం మండలంలో వర్కర్స్..3, హెల్పర్స్..3 కలిపి మొత్తం..17 మందికి నియామకపత్రాలను అందజేయడం జరిగిందన్నారు. చిన్నారులకు పౌష్టికాహారం అందించటంలో, ఆటపాటలతో కూడిన చదువుని అందించడంలో అంగన్‌వాడీలు ముఖ్యపాత్ర పోషించాలన్నారు. కార్యక్రమంలో మదనపల్లె, పుంగనూరు సీడీపీఓలు సుజాత, రాజేశ్వరి, సూపర్‌వైజర్‌లు చంద్రకాంత, శాంతమ్మ, భాను, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ అప్‌డేట్ తప్పనిసరి

డీఎల్‌డీఓ లక్ష్మీపతి



మాట్లాడుతున్న డీఎల్‌డీఓ లక్ష్మీపతి

మదనపల్లె : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు, పౌరసేవలు పొందాలంటే ఆధార్ అప్‌డేట్ తప్పనిసరి అని డీఎల్‌డీఓ లక్ష్మీపతి అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామపంచాయతీ సచివాలయ అధికారులు, ఏఎన్‌ఎంలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2015 సంవత్సరం కంటే ముందు ఆధార్ పొంది అప్‌డేట్ చేయనివారు వెంటనే ఆధార్ నమోదు, నవీకరణలు వందశాతం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. మదనపల్లె డివిజన్‌లో ఆధార్ అప్‌డేట్ కోసం 39 కేంద్రాలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకునేలా సచివాలయ సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. పంచాయతీల్లోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను వెల్‌ఫేర్, ఏఎన్‌ఎం, ఎంఎస్‌కే ఉద్యోగులు వారికి కేటాయించిన స్కూల్స్‌ను, కేటాయించిన సమయంలో తప్పనిసరిగా ఇన్స్‌పెక్షన్ చేయాలన్నారు. ఎస్‌జీడీ గోల్స్‌ను సమన్వయంతో సాధించాలన్నారు. పిల్లల్లో రక్తహీనతపై దృష్టిపెట్టాలన్నారు. సచివాలయాల్లో సర్వీసుల సంఖ్యను పెంచాలన్నారు. వేసవి ఎండల తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో సచివాలయాల్లో ఓఆర్‌ఎస్ అందుబాటులో పెట్టుకోవాలని, ప్రతి గ్రామంలోనూ చలివేంద్రాలు ఏర్పాటుచేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ తాజ్‌మస్రూర్, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

టౌన్‌ప్లానింగ్ నిబంధనల మేరకు లేఅవుట్లు

ఆర్డీఓ ఎం.ఎస్.మురళి



భూ రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీఓ ఎం.ఎస్.మురళి

మదనపల్లె : మదనపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలో లేఅవుట్లు వేసే రియల్టర్లు పీకేఎం-ఉడా అనుమతులతో పాటు టౌన్‌అండ్ కంట్రీ ప్లానింగ్ నిబంధనల మేరకు నడచుకోవాలని ఆర్డీఓ ఎం.ఎస్.మురళి అన్నారు. మంగళవారం మండలంలోని బసినికొండ, వెంకప్పకోట, చిప్పిలి గ్రామాల పరిధిలో కన్వర్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న వ్యవసాయ భూములను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. లేఅవుట్ల యజమానులు ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కన్వర్షన్‌కు సంబంధించిన దరఖాస్తులను, భూరికార్డులు, యాజమాన్యహక్కులను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సీకే.శ్రీనివాసులు, ఆర్‌ఐ రెడ్డెప్ప, మండల సర్వేయర్ ముబారక్ తదితరులు పాల్గొన్నారు.

పీలేరు పంచాయతీకి రూ. 24.69 లక్షల ఆదాయం



వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

పీలేరు : పీలేరు గ్రామ పంచాయతీ పరిధిలో వారపు సంత, దినసరి కూరగాయల మార్కెట్, ప్రైవేట్ బస్టాండ్, జంతువధ శాల గేటు వసూలు హక్కు పొందడానికి నిర్వహించిన వేలంలో పంచాయతీకి రూ. 24.69 లక్షల ఆదాయం వచ్చినట్లు డీఎల్‌పీవో నారాయణ, సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా తెలిపారు. మంగళవారం స్థానిక గ్రామ పంచాయతీలో వేలం నిర్వహించారు. ఈ సందర్భంగా వారపుసంత, దినసరి కూరగాయల మార్కెట్‌ను శాంతకుమారి రూ. 15,01,000కు హెచ్చుపాట ద్వారా దక్కించుకున్నారు. అలాగు ప్రైవేట్ బస్టాండ్‌లను బాదుషా రూ. 5,37,000కు, జంతువధశాలను మసూద్ రూ. 4,31,000కు హెచ్చుపాట ద్వారా దక్కించుకున్నట్లు వివరించారు.

వారపుసంత, దినసరి కూరగాయాల మార్కెట్‌కు ఎంపీ సొంతనిధులు

వారపుసంత, దినసరి కూరగాయల మార్కెట్‌ను శాంతకుమారి రూ. 15,01,000కు హెచ్చుపాట ద్వారా దక్కించుకోగా ఈ మొత్తాన్ని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి సొంత నిధులు చెల్లించనున్నట్లు సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి వచ్చే ఏడు మార్చి 31వ తేదీ వరకు వారపుసంత, దినసరి కూరగాయాల మార్కెట్ వ్యాపారులు, రైతులు ఎవరూ గేటు చెల్లించాల్సిన అవసరం లేదని తెలిపారు. దీంతో ఎంపీకి పలువురు వ్యాపారస్తులు, రైతులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఈఓ రెడ్డిప్రసాద్‌రెడ్డి, శానిటరీ ఇన్స్‌పెక్టర్ రవికుమార్, వార్డు మెంబరు ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులు కండీషన్‌లో ఉండాలి

డీపీటీవో పి. రాము



గ్యారేజీ సిబ్బందితో మాట్లాడుతున్న డీపీటీవో పి. రాము

పీలేరు రూరల్ : ఆర్టీసీ బస్సులను మంచి కండీషన్‌లో ఉంచాలని డీపీటీవో పి. రాము అన్నారు. మంగళవారం నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆయన పీలేరు ఆర్టీసీ బస్టాండ్, గ్యారేజీను, డిపోను పరిశీలించారు. అనంతరం గ్యారేజ్‌లో గేట్ మీటింగ్ నిర్వహించి మెకానిక్‌లతో మాట్లాడుతూ రన్నింగ్ సమయంలో ఏ ఒక్క బస్సులో ఆగకూడదని ఆదేశించారు. మెకానిక్‌లు ఎప్పుడు పనులు అప్పుడు పూర్తి చేసి బస్సులను సరైన కండీషన్‌లో ఉంచాలన్నారు. డ్రైవర్లు కూడా విధులకు హాజరయ్యేటప్పుడు బస్సుల కండీషన్‌ను పరిశీలించుకోవాలని సూచించారు. ప్రయాణీకులకు ఇబ్బందులు కలగకుండా బస్సు సర్వీసులు నడపాలని ఆదేశించారు. పీలేరు నుంచి బెంగళూరుకు ఐరాల, కాణిపాకం, బంగారుపాళెం, తవణంపల్లె, పలమనేరు మీదుగా కొత్త సర్వీసును నడుపనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఎం కుమార్, గ్యారేజ్ ఎంఎఫ్ హరినాథరెడ్డి, ఎస్టీఐ సుధాకర్‌నాయక్, ఏడీసీలు పాల్గొన్నారు.